క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు, 33 కేవీ పెద్ద షాపూర్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా మండల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెద్దషాపూర్ సబ్ స్టేషన్ ఏఈఈ జి.లక్ష్మీనారాయణ తెలిపారు. పెద్దషాపూర్, అలీకోల్‌తండా, మదన్‌పల్లి, మదన్‌పల్లి కొత్త తండా, గచ్చుబాయి తండా పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని వివరించారు.

సీబీఐటీలో రక్తదానం

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సయుక్తంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... రక్తదానం చేయటం వలన మన మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం ఉండటంతో పాటు సమాజంలో రక్తం అవసరమైన వారిని ఆదుకునే అవకాశం కలుగుతుందన్నారు. రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ప్రతి ఆరు నెలలకు ఒక సారి రక్తదానం చేయాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.గణేష్‌రావు అన్నారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎన్.విజయలక్ష్మి, మాదవి, సీహెచ్ అరుణ, ఎం.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.షాహిద్ నౌఖేజ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

రాయదుర్గం: మనూ ప్రొఫెసర్ షాహిద్ నౌఖేజ్ అజ్మీకు ఇరాన్ దేశ ప్రతిష్టాత్మక సాది అంతర్జాతీయ అవార్డు లభించింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్‌లో ఆయన ప్రొఫెసర్. పర్షియన్ భాష, సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇరాన్ ప్రభుత్వం నుంచి ×జైజా సాదీ×ని అందుకున్నారు. ప్రొఫెసర్ షాహిద్‌నౌఖేజ్ ఇప్పటివరకు 26 పుస్తకాలు రచించగా, 98 విద్యా, పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, అధికారులు అభినందించారు.

'మనూ' కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్స్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ (డీఎస్‌డబ్ల్యూ), కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు, పలు రకాల కార్యకలాపాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వినోద్‌కుమార్‌కు వినతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ, అత్యంత వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు జేఎన్‌యూ, పాండిచ్చేరి యూనివర్సిటీ తరహాలో ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అరుణ్ కేతన్ వినోద్‌కుమార్‌ను కలిసి మాట్లాడారు. హెచ్‌సీయూ శాటిలైట్ క్యాంపస్‌ను ఉత్తర తెలంగాణలోని కరీంనగర్‌లో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో లేడీస్ హాస్టళ్ల పట్ల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రీతప్రియ, ఆసిక, సుభాషిణి, నవమి, గాయత్రి, గౌరీ నాయకత్వం వహించగా పలువురు మహిళా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం హాస్టళ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నో కోడ్ టెక్నాలజీపై ప్యానెల్ డిస్కషన్

గచ్చిబౌలి: నాస్కామ్ ఆధ్వర్యంలో బుధవారం కోడ్ అండ్ నో కోడ్ టెక్నాలజీ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రజాస్వామ్యీకరణపై ప్యానెల్ డిస్కషన్‌ను గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్విక్సీ కస్టమర్ సక్సెస్ హెడ్ గురుప్రసాద్ పమ్మి మాట్లాడుతూ క్విక్సీ వినియోగదారుల నుంచి పెరుగుతున్న నమ్మకాన్ని నమోదు చేశామని, వారు సాధారణ వినియోగ కేసుల కోసం నో కోడ్‌ని అమలు చేయడం నుంచి మరింత సంక్లిష్టమైన, సమగ్రమైన ఫంక్షన్‌ల వరకు అభివృద్ధి చెందారన్నారు. క్విక్సీ 15కి పైగా పరిశ్రమలతో పని చేస్తుందన్నారు. ఏఆర్‌టీఈఏఎస్ఎస్ సహ వ్యవస్థాపకుడు, సీటీఓ సిద్ధార్థ మొహంతి, యాంప్లిలాజిక్ వ్యవస్థాపకుడు సీఈఓ మన్నె.వి.చౌదరిలు క్రియాశీల భాగస్వామ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కంటి వెలుగుకు క్యూ

- 11,960 మందికి పరీక్షలు
- పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వత కేంద్రాలకు డిమాండ్



శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో 9 చోట్ల కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 11,960 మంది కంటి పరీక్షలు చేశారు. కాగా ఈ కంటి వెలుగు కేంద్రాలను పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో జనవరి 19వ తేదీన ప్రారంభించారు.
- సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉంటాయి
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పనిచేస్తాయి
- ఆధార్ కార్డు తీసుకొస్తే కంటి పరీక్షలు చేస్తారు.
- 9 కేంద్రాలలో 11,960 మందికి కంటి పరీక్షలు చేయగా, 2,850 మందికి కంటి అద్దాలు (రీడింగ్) ఇవ్వగా 1,235 మందికి కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు అందించేందుకు ఆర్డర్ పెట్టారు. 467 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు.

కంటి వెలుగు పరీక్షా కేంద్రాల వివరాలు...

	పరీక్షలు	గ్లాసులు	గ్లాస్‌లుఇవ్వాల్సినవి
సగర సంఘం కమ్యూనిటీ హాల్, అంజయ్యనగర్‌కాలనీ	1381	157	29
కమ్యూనిటీ హాల్, కొత్తగూడ	1287	270	214
కల్చరల్ క్లబ్ హాల్,అయ్యప్ప సొసైటీ	1374	248	123
కమ్యూనిటీ హాల్, మయూరీనగర్‌కాలనీ	1290	244	95
పీజేఆర్ స్టేడియం, చందానగర్	1354	510	113
జనప్రియనగర్‌కమ్యూనిటీహాల్ జనప్రియనగర్	1276	289	125
సిర్కి ఆఫీస్ ప్రాంగణం,భెల్ ఎంఐజీకాలనీ	1288	394	82
ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం-శేరిలింగంపల్లి	1376	481	289
వార్డు కార్యాలయ ప్రాంగణం-రాయదుర్గం	1354	257	165
కంటి వెలుగు పరీక్షల వివరాలు	11,960	2,850	1,235

కంటి పరీక్షలు చేయించుకున్నా..



ప్రభుత్వం ఏర్పాటు చేయించిన కంటి పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్న. సంతోషంగా ఉంది. మరోసారి చెక్ చేయించుకోవడానికి అవకాశం కల్పించాలి. మా బస్తీలో చాలా మంది చేయించుకున్నారు. అద్దాలు కూడా ఇస్తున్నారు. అవసరమైతే ఆపరేషన్ కూడా చేయిస్తరని తెలిసింది.

– లక్ష్మి, రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ

ఎంతో ఉపయోగకరం



కంటి వెలుగు కేంద్రాల ఏర్పాటు ఆనందదాయకం. ముసలివారికి ఎంతో ఉపయోగకరం. రూపాయి లేకుండా పరీక్షలు చేయడం, అవసరమైతే అద్దాలు ఇవ్వడం, మరీ అవసరమైతే ఆపరేషన్ చేయిస్తామనడం సంతోషదాయకం.

–భద్రమ్మ, గుల్‌మొహర్‌పార్కు కాలనీ

పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో శాశ్వతంగా ఏర్పాటు చేయాలి



పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో కంటి పరీక్ష కేంద్రాలను కొనసాగించాలి. పేద, మధ్యతరగతి వారికి ఎంతో మేలు చేకూరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బాలయ్య, గోపీనగర్

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలోని దేవాలయ నిర్మాణం జరిగి సంవత్సరం పూర్తి కావటంతో మంగళవారం నుంచి వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్నారు. పూజల్లో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం మండల పునః పూజలు, శ్రీ ఉమాకాశీ విశ్వనాథునికి ప్రతిష్టాంగ దేవతలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహానైవేద్యం, నిరాజనం, అన్న ప్రసాద వితరణ, సహస్ర బిల్వార్చన, స్వామి వారికి రుద్రహోమం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ వందన నగేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఆనంద్‌రావు, దేవాలయ కమిటీ చైర్మన్ ఎం, వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు దేవరాజులు నాయుడు, ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి. కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయండి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం శివరాంపల్లి విద్యుత్ ఏఈ హరినాథచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శివరాంపల్లి, ప్రశాంత్‌కాలనీ, కృష్ణానగర్, వీకర్ సెక్షన్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీలలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయోనని కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పలు వీధుల్లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతుండటంతో ప్రమాదాలు పొంచి ఉందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై ఏఈ సానుకూలంగా స్పందించారని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.వెంకటేష్, గౌరవాధ్యక్షుడు డి.రమేష్, ఉపాధ్యక్షుడు డి.ఆంజనేయులు, కార్యదర్శులు పి.ప్రకాష్‌రెడ్డి, ఎస్.శ్రీధర్, సభ్యులు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

శంషాబాద్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొని గాయాలైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన శింబ్ అలియాస్ శివ మదన్‌పల్లిపాత తండాలో శంకర్ వద్ద వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. నిత్యావసర సరుకుల కోసం మంగళవారం రాత్రి మదన్‌పల్లి వెళ్లాడు. తిరిగి వస్తూ మదన్‌పల్లి పాతతండా చౌరస్తాలో రోడ్డు దాటుతున్నాడు.

ఇదే సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి శంషాబాద్ వెళ్తున్న కారు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలైన అతన్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందని రాజేంద్రనగర్ మండల కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్, కోశాధికారి భాస్కర్‌లు వెల్లడించారు. బుధవారం కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పని చేస్తున్న కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పని చేసే కొత్త షర్టుపాయింట్లు, నూతన వస్త్రాలు కుట్టే దగ్గర పని చేసే కాటేదాన్ గార్మెంట్స్, ప్యాకర్స్ కార్మికులు కాటేదాన్ ప్రాంతంలో చిన్నచిన్న షెడ్లు పీస్ వర్క్ రూపంలో తీసుకోని రోజువారి కొత్త బట్టల హోయ్‌రాను వాటిని ప్యాకింగ్ చేస్తూ పలు పరిశ్రమలు ఈ మధ్యకాలంలో కాటేదాన్ ఇండస్ట్రీ ఏరియాలో వచ్చాయన్నారు. అందులో పని చేసే కార్మికులందరి పీస్ వర్క్ రూపంలో మాత్రమే లెక్క కట్టి అతి తక్కువ రోజు వారి వేతనం ఇస్తున్నారన్నారు. అలా కాకుండా వారికి సంబంధించిన చట్టాల ఆధారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాటేదాన్ పరిశ్రమ ప్రాంతంలో ఉన్నటువంటి కార్మికుల అందరితో సమావేశం ఏర్పాటు చేసి వారందరిని సిఐటియూ నూతన కమిటి వేయడం జరిగిందన్నారు. అధ్యక్షులుగా రుద్రకుమార్, ఉపాధ్యక్షులు మహేందర్, కార్యదర్శిగా రవి, కోశాధికారిగా వెంకటయ్య, సహాయ కార్యదర్శిగా గిరి తదితరులను ఎన్నుకున్నారు. కాటేదాన్ ఇండస్ట్రీ ప్రాంతంలో ఉన్నటువంటి కొత్త బట్టల తయారీ టైలరింగ్‌కు సంబంధించినటువంటి కార్మికులందరి శ్రేయస్సు కోసం వాళ్ల హక్కుల కోసం ముందుండి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రుద్రకుమార్

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం శ్రీ పార్వతీరామలింగేశ్వరాలయ ఆవరణలో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలను నిర్వహించారు. పూజల్లో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు డి.లక్ష్మణ్, కె.ప్రభాకర్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్



రాజేంద్రనగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజేంద్రనగర్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వై.ప్రణయ్ ఆరోపించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజేంద్రనగర్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రాజేంద్రనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రణయ్, జిల్లా కమిటి సభ్యుడు ఆనంద్ మాట్లాడుతూ... విద్యను బహుజన, బడుగు, బలహీన, మధ్య తరగతి, పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్రాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అర్జున్, కౌశిక్, ఆర్తి, లావణ్య, శ్రావ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

'యూ టర్న్' ఏర్పాట్లు పూర్తి



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్

శంషాబాద్: ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పట్టణంలోని జాతీయ రహదారిపై యుటర్న్ ఏర్పాటును పూర్తి చేశారు. శంషాబాద్ పట్టణంలో సాతంరాయి వరకు యూ టర్న్ లేకపోవడంతో వాహనదారులు, స్థానికులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఫ్లైఓవర్ పనులు కూడా తుది దశకు చేరుతుండటంతో వాహనాలు రోడ్డుకు అవతలి వైపునకు వెళ్లేందుకు నక్షత్ర కాలనీ ఎదురుగా ఏర్పాట్లు చేశారు. స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ విన్నపం మేరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచనలతో ట్రాఫిక్ పోలీసులు సరైన స్థలాన్ని సూచించారు. దీంతో యూటర్న్ చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతి అందుకుంటున్న హారిక

మైలార్‌దేవ్‌పల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ ఆలోచనలకు పదునుపెట్టాల్సిన అవసరం ఉందని గణేష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బయోసైన్స్ ఉపాధ్యాయుడు నవారు మురళీధర్‌రెడ్డి అన్నారు. కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలోని నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు కంప్యూటర్లు అందిస్తూ వాటి ద్వారా విద్యార్థులు సులువుగా ప్రాజెక్టులు చేసే విధానాలను సంబంధిత కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు విద్యార్థులకు అందిస్తున్నారు. అందులో భాగంగా ఇన్ఫోసిస్‌లో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని హారిక అటెండెన్స్ రిజిస్టర్ తయారు చేసి ప్రజెంటేషన్ ద్వారా ఇన్‌స్ట్రక్టర్లను ఆకట్టుకుందన్నారు. వంద మంది విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హారికకు రెండవ బహుమతి లభించిందన్నారు. భారత దేశ వ్యవసాయ నేపథ్యం, పంట విధానాలను మరో విద్యార్థి సిరి ప్రజెంటేషన్ ద్వారా తెలిపి అధికారుల ప్రశంసలు పొందారని తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్ బాగుంది

గోల్కొండ: మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ చాలా బాగుందని అడ్వకేట్స్ ఫోరం ఫర్ జస్టిస్ రాష్ట్ర చైర్మన్, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో టోలిచౌకిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ న్యాయవాదులకు అండగా ఉంటారన్నారు. న్యాయవాదుల సమస్యలు సీఎం కేసీఆర్‌కు తెలుసని, అందువల్లే న్యాయవాదుల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారన్నారు. కార్యక్రమంలో ఎం.ఏ.ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు ప్రజల మద్దతు పెరుగుతోంది



గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజల పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో మజ్లిస్ కార్పొరేటర్, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీకి రోజురోజుకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతుందన్నారు. సెక్యులర్ సిద్ధాంతాల్ని పక్కాగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని, అందువల్లే తమ పార్టీ తెలంగాణ నుంచి మరిన్ని సీట్లకు పోటీ చేయాలని నిర్ణయించిందన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. మజ్లిస్ పార్టీ నిబద్ధతకు కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శమని ఆయన అన్నారు. ఇక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులు పూర్తి కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. పనులను స్థానికులు పరిశీలిస్తూ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

గోల్కొండ: రోడ్లను అద్దంలా తయారు చేస్తామని ప్రభుత్వ అధికారులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదు. అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్లు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేస్తూ నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకి, లంగర్‌హౌస్ డివిజన్‌లలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఇందులో వరద నీటి పైప్‌లైన్ పనులు సైతం ఉన్నాయి. అయితే పనులు ప్రారంభం కాకముందే అధికారుల ఆదేశాలతో గుత్తేదార్లు భారీ పైపులను రోడ్డు పక్కన వేశారు. పైపులు వేసేందుకు తవ్వకాలు సైతం చేశారు. గోల్కొండ, బంజార దర్వాజ నుంచి కఠోర హౌస్ మీదుగా గోల్కొండ కోటకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన భారీ పైపులు పడివున్నాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. టోలిచౌకి చౌరస్తా నుంచి టూంబ్స్ రోడ్డు వెళ్లే మార్గంలో సైతం జరుగుతున్న డ్రైనేజీ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. కంపెనీ బాగ్, మహ్మదీ లైన్ చౌరస్తా తదితర ప్రాంతాలలో నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదార్లు తమ ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి తవ్విన రోడ్లను పూడ్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



బంజార దర్వాజ-గోల్కొండ రోడ్డు పక్కన ఉన్న పైపులు